# ప్రేమకథలో

# ఆఖరిఘట్టం

సలీమ్ ప్రేమించాడు; హృదయంనిండా ప్రేమించాడు; విరహాగ్నికి శలభంలా మాడిపోయేంత ఉద్రేకంతో ప్రేమించాడు.

ఉష చిరునవ్వుతో సమాధానమిచ్చింది... ప్రసన్న వదనంతో ఆహ్వానించింది... వేడి కౌగిలింతతో సన్మానించింది.

అమ్మా, నాన్నా తమతమ ఉద్యోగాలకు వెళ్ళిపోయాక ఆ ఆవరణంలో ప్రేమ నవ్వులతో మారుమ్రోగేది. ఆ యింటికీ, ఆ తోటకీ, ఆ ఆవరణకీ ఉషాదేవి రాణి!... సలీమే పాదుషా!! ప్రేమతో చెట్లు గింగురుమనేవి...... కోకిలపాటలు శ్రుతులు కలిపేవి; పరుగులతో, కేరింతాలతో సయ్యాటలతో ప్రకృతి ప్రతిధ్వనించేది.

సలీమ్ గానానికి ఉషాదేవి వీణ మెట్లమీద మునివేళ్ళను చక్కగా నాట్యంచేయించేది...

దినాలు దినమొులతో నడిచి వెళ్ళిపోయాయి... ప్రేమతిని బ్రతుకుతూన్న పక్షుల్ని పొట్లాంకట్టి దూరంగా విసిరేసింది కాలం!

అనుకూలమైన సిద్ధాంతాలు తమ దారిని సుగమం చేస్తాయనుకొనేవారు. ('విరహాగ్నిలో కాలితేకాని ప్రేమ హృదయాలు పరిపక్వత చెందవు.')

భోజనంచేసివచ్చి కారాకిళ్ళీ బుగ్గలో బిగించి— 'ఉషను తలపోసుకొనేవాడు సలీమ్! ఆమె గొంతులోని సెలయేటి మార్దవం, దేహంలోని ఒంపుసొంపులు, మందగమనాలు... అతని స్మృతివీథుల్లో నిలిచి, పిలిచి, పలకరించేవి. అతను ఆ నిర్మలమైన నిస్త్రంత్రీ సంభాషణలకు తట్టుకోలేక, దీనంగా కంటినీటితో, గుడ్లు మిటకరించేవాడు.

బైరన్ షెల్లీల కావ్యాల్లో, కృష్ణశాస్త్రి ఊర్వశిల్లో, మొపాసాంకథల్లో, చలం కథానాయికల్లో, ఉష స్పష్టంగా కనిపించేది. లోతైన నీలాకాశంలో మెరిసే నక్షత్రాల్లో, మెరుపుతీగల్లో, ఉషఃకాంతిలో, కమ్మని సంగీతంలో— సర్వం ఉషమయంగా వ్యక్తమయేది సలీమ్‌కి.

"ఉషా! నీ పేరు, పాట వెనక మ్రోగే తంబుర శ్రుతిలాగ అనవరతం నా ప్రతిచేష్ట వెనుకా మారుమ్రోగు

తూనే ఉంటుంది!'' అనేవాడు. ఎక్కడో చదివిన ఈ వాక్యం అతని స్వంతమే అన్నంత పరిచితంగా తరచు ఉపయోగించేవాడు.

నిర్జన ప్రదేశంలో ఒంటరిగా కూర్చుని, ఉషను గొంతెత్తి పిలిచేవాడు. లోకం తనకేసి చూసి నవ్వుతుందనేనా గుర్తించలేడతను. ఏవేవో అడవిపువ్వులు తుంపి వాసన చూచేవాడు...వాడిపోయిన అడవిమొల్లల వాసనచూస్తుంటే గతాలున ఉష జ్ఞాపకంవచ్చేది. మెదడంతా ఆలోచనాతరంగాలతో వ్యాపించేది. నిశ్శబ్దం ఛేదించి, ధ్వనితరంగాలు గాలిలోకి భిన్నాభిన్నమై, తన కతీతంగా లీనమౌతున్నట్టుగా, కమ్మనివాసనలతో, అతనిలో ఉష చుట్టూఉన్న వాతావరణాన్ని అల్లేది.

"గందరగోళంగా గంతులువేస్తూ, భిన్న విభిన్న ఉద్రేకాలకు లోనవుతూ, ఒడిదుడుకులతో, ఊగిసలాడే ప్రపంచ సాగరతటంపై కూర్చుని, ఏవో బొమ్మరిళ్ళు నిర్మించుకుంటారు ప్రేమికులు... కెరటాలు పొంగి, ఉరకలువేస్తూ, ఆ ఇసుక బొమ్మరిళ్ళను మంచేస్తూఉంటే, చూస్తూ, ఏడుస్తూ కూచుంటారు!'' అన్నాడు కవి.

ఆదర్శవాదంలోని ఔన్నత్యాన్ని, సుఖప్రదమైన స్థితిమితత్వాన్ని, రుచిచూచిన సలీమ్, కవిని సన్నుతించేవాడు. ప్రేయసిని తలపోసుకుంటూ మహతకుర్చీలో కూర్చునే సలీమ్‌కి,

ఆవిధమైన జీవితం సున్నితమైన అలవాటుగా మారిపోయింది. ఏపనీ చేయలేని అలసత్వానికీ, దేనికీ ధైర్యం చేయలేని సంతృప్తికీ సలీమ్ లోబడిపోయాడు.

కవి అంటున్నాడు : "నిర్వీర్యమైన ఆదర్శవాదంతో ప్రేమికులు, అసత్యమైన ఊహాసోపానాలొక్కటొక్కటే ఎక్కి ఏదో లేనిపోని ఔన్నత్యాన్ని పొందినట్టు భావించుకుంటారు. ఆ ఔన్నత్యం కల్లగా గ్రహించడం ప్రారంభించినప్పటినుంచీ విచారంతో ఖిన్నులవుతుంటారు..."అని.

కవి వాక్యాలు సలీమ్ గుండెల్లో తరంగాల్ని రెచ్చగొట్టేవి. ఆలోచనల మేల్కొల్పేవి..."స్వంతంగా ఆలోచించి సమస్యల పరిష్కార సమన్వయాన్ని పొందలేకపోతే, మానవత్వం సమగ్రతను పొందదు..." అనుకునేవాడు సలీం.

ఉషాదేవి వ్రాసిన లేఖల్ని చిరునవ్వు పెదవులతో చదువుకునేవాడు. నిద్రపోతూన్న తలపుల్ని తిరగతోడుకునేవాడు సలీం! "ఆమెలేని జీవితం నిష్ప్రయోజనం– ప్రేమలో విజయం పొందనిమానవుడు జీవించడం అనవసరం!"అనేవాడు.

"మానవజీవితం సాధించే ఉత్కృష్ట ప్రయోజనాలలో 'ప్రేమ' చాలా సామాన్యమైనదే, కాని జీవిత సమస్తాన్నీ ఆక్రమించే నల్లనిమబ్బు కాకూడదు. మానవుడు జన్మెత్తి సమాజంలో తన స్థానాన్ని, తన జీవిత సమగ్ర ప్రయోజనాన్ని గ్రహించుకోలేకపోతే పశుదశలో ఉన్నాడన్నమాట.."

ఉద్రేకంగా చెబుతున్నాడు కవి. తీక్ష్ణంగా కవి కన్నుల్లోకి చూస్తున్నాడు సలీం.

కవి అంటున్నాడు: "తానే ప్రజలమధ్య పుట్టాడో తానేమానవ సమాజ భాగంలో జన్మించాడో, ఆ ప్రజల సౌఖ్యమయ జీవితంకోసం, ఆ సమాజంలోని కృతకత్వాన్ని భగ్నంచేయడంకోసం, అవసరమైతే తన జీవితాన్ని అర్పించినా నష్టంలేదు. 'ప్రేమ-ప్రేమ' అనుకుంటూన్న ప్రేమికులు తాము సాధించిన ఔన్నత్యానికి భౌతికానికి సంబంధించిన ఐహిక పరిస్థితులకీ ఎంతో అంతరం ఉందనుకోవడం మూర్ఖత్వం అంటూన్న కవిమాటలకి సలీం నొచ్చుకున్నాడు... తన అనుభూతుల్ని అవమానపరుస్తున్నాడు కవి అనుకున్నాడు సలీం!!

రోజులు గడచి కాలం ఘనీభవిస్తున్నకొద్దీ, ఉష సలీంకి దూరమైపోతోంది. రోజురోజుకీ సలీం అభివృద్ధి అవుతున్నాననుకొంటున్నా; సెంటిమెంటల్‌గా లేనిపోని ఉద్రేకాలకు లోనవడం మానలేదు; విచారంతో పాతాళానికి కృంగిపోయేవాడు.

కవి సలీంలో సిద్ధాంత పరిపక్వత కలిగించాలని తీవ్ర ప్రయత్నంచేసి, కొంతవరకన్నా ఫలితాన్ని సాధించగలిగాడు. అతననేవాడు...... "కుర్చీలో కూర్చొని నీవెంతగా మధుర స్వప్నాలు కల్పించుకున్నా, అవన్నీ పీడకలలుగా మాత్రమే

త్రయస్థై నీ అభివృద్ధిని అరికడతాయి! తనచుట్టూ సంఘం కట్టిన ఉక్కు చట్టాల్ని కొంతవరకయినా బద్దలుకొట్టకపోతే మానవుడు ప్రేమలో విజయం సాధించలేడు సరికదా తన చుట్టూవున్న బంధనాల్ని మరింత బిగించుకోవడమే జరుగుతుంది ఆచరణలో..."అన్నాడు కవి సలీమ్‌తో.

సలీం అంటున్నాడు: "తమ ఆఖరి కోరికల్ని నాపై కేంద్రీకరించుకున్న తల్లిదండ్రుల్ని ఎలా విడిచిపెట్టను...? నా కుటుంబానికే దూరమైపోగలనా?" సలీం మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"చాలు, ఆమాట చాలు... ప్రేమ విలువల్ని నిర్ణయించే గీటురాయి ఆ ఒక్కమాటే! అర్థంలేని కన్నీళ్లెందుకు? తాను ప్రేమిస్తున్నాననుకొంటున్న ప్రేయసికంటె తల్లిదండ్రుల పాతసమాజమే ఘనమైనపుడు, ఆ కన్నీళ్ళకి విలువలేదు... దొంగ కన్నీళ్ళుమాత్రమే అవి..." కవి స్పష్టంగా, నిర్మొహమాటంగా అనేశాడు.

కాలేజీ జీవితం ప్రారంభించిన ఉషని అచిరకాలంలోనే ప్రభాకరం ఆకర్షించాడు. ఆమెలోని ప్రేమ కొత్తబట్టలు కట్టుకుంది. కొత్త దుస్తుల మత్తువాసనలో శరీరాలు, బుద్ధులు కోరికలు అన్నీ ఏకత్వాగ పొందాయి.

సలీం ద్వేషంతో గర్జించాడు; ఈర్ష్యతో ఉరిమాడు... ఆపని చేసేందుకు ఆమెకు హక్కులేదనీ, తన స్వార్జితమైన హక్కు నిలుపుకుంటాననీ...

మిత్రుల వేషంలోని శత్రువులు అతని ఉద్రేకాల నెగసనతో సేవారు.

"...లే ఇంక విచారించకు. నీ జీవిత పరమావధిని నీ దేశ ఔన్నత్యంకోసం నిమగ్నంచేయి. రా! పీడితప్రజల కోసం కలసి పాటుపడదాం......!" అన్నాడు కవి. సలీం మౌనంతో అంగీకరించాడు.

తన గుండెల్లో పొగచూరి కొడిగట్టిన ప్రేమదీపాన్ని మెల్లగా ఆర్పేయాలనే ప్రయత్నించాడు.

గ్రంథాలు పఠించేవాడు, సిద్ధాంతాల్ని ఒంటబట్టించు కోటానికే ప్రయత్నించేవాడు. కాని బాగా జీర్ణమై రక్తంలో కలవకపోవడం అలావుంచి, అతనిలో దాగున్న ఉద్రేకి ఉబికి వచ్చేవాడు కొన్ని సమయాల్లో...

కవిని గురించి సలీం అనేవాడు– "జీవిత ముడిపదార్థా న్నుంచి కళాఖండాలను వుత్పత్తి చేసే యంత్రమే కవి"–అని.

కాలం అతని ప్రక్కనుంచి నిప్పులు కక్కుకుంటూ వెళ్ళిపోతూంటే, అతనిలో స్పందనలు కలుగకుండా ఎలా ఉంటాయి?

జీవితం గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు సలీం.

"ఏదో సంకుచిత మనోవికారాన్ని ప్రేమగా భావించుకుంటూ కలలు కనేకంటే, మన చుట్టూవున్న సమాజపు భౌతిక పరిస్థితుల్లో మార్పు తెస్తేనేగాని జీవితపు ప్రయోజనం సాధించబడదు" అనేవాడు సలీం.

సలీం చుట్టూవున్న పరిస్థితులు పూర్వాంకంటే విషమిస్తున్నాయి.

"అస్తమానూ పుస్తకాలు పట్టుకుని కూర్చుంటే—ఎలాగరా?" అనేవారు ఇంటిలో పెద్దలు.

"ఉత్తమ పుస్తకాలు నాలోని సంస్కృతిని పెంపొందిస్తాయి— మానవత్వాన్ని ప్రసాదిస్తాయి— మానవత్వాన్ని సాధించడం నా ఉత్తమ కర్తవ్యం..."అనేవాడు సలీం.

సలీంలో మార్పు త్వరత్వరగా వస్తూంది. జీవితాన్ని అణాపైసల్లో విడమర్చుకోగలుగుతున్నాడు సలీం. "దైహిక విలక్షణాల ఆంతరంగిక ప్రతిబింబంగా మానవుడు మానసికంగా కల్పించుకునే మధురస్వప్నమే ప్రేమ!" అని నమ్మగలిగాడు సలీం!

చుట్టూ కూర్చున్న మిత్రులతో కులాసాగా గడపకుండా మౌనంవహించే సలీం, హృదయంవిప్పి ఉద్రేకంగా మాట్లాడుతున్నాడు; మిత్రులు ఆశ్చర్యంగా వింటున్నారు— అతనంటున్నాడు: "ఆర్థిక ఔన్నత్యంకోసం మానవుడు

సాహసించిన సంఘర్షణనే చరిత్ర అంటున్నారు; ప్రజా సామూన్యం అసంతృప్తితో తిరుగుబాటు చేస్తారనే భయంతో—ధనికవర్గం తన ఆధీనంలో ఉన్న విజ్ఞానులచేత స్వర్గమనే చక్కని ఊహను నిర్మించగలిగింది... మతమనే నల్లమందుతో ప్రజా సామాన్యాన్ని మత్తులో ముంచి లోబరుచుకుంది...సౌందర్యం కళా, ప్రేమా ఇలాంటి పదాలు నిరర్థకమైనవి కావు. ఆర్థిక స్థితితో పాటు వీటి రూపాలలోనూ, విలువలలోనూ మార్పు తప్పనిసరిగా వస్తుంది!"

"ఆరోగ్యవంతుడవయ్యావ్, సలీమ్! ఆనందంగా ఉంది సాకు!" అన్నాడు కవి.

★